క్లుప్తంగా

నేడు మిట్టకందాలకు దారా సుధీర్

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామానికి వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ శుక్రవారం రానున్నారని పార్టీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. పరిచయ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 4గంటలకు గ్రామంలో పర్యటించనున్నట్లు చెప్పారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

తప్పిన ప్రమాదం



చెలరేగిన మంటలు



మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

మిడుతూరు: మండలంలోని జలకనూరు గ్రామ శివారులో (మంచాలకట్ట రహదారి) గుర్తు తెలియని వ్యక్తులు జమ్ముగడ్డికి నిప్పుపెట్టడంతో మంటలు మైనార్టీ కాలనీకి వ్యాపించాయి. అప్రమత్తమైన గ్రామస్తులు బిందెలతో నీటిని తీసుకెళ్లి మంటలు అదుపులోకి తీసుకురావడానికి యత్నించారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ విజయభాస్కర్, ఎస్ఐ జగన్మోహన్ ఘటనాస్థలానికి చేరుకొని జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పీ చొరవతో సోలార్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ఫైర్ ఇంజిన్ పంపారు. గ్రామానికి చేరుకున్న ఫైర్ ఇంజిన్ సిబ్బంది స్థానికులతో కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా మంటలు అదుపులోకి రాకపోతే పలు గడ్డి వాములు పూర్తిగా దగ్ధమయ్యేవని గ్రామస్తులు తెలిపారు. జిల్లా ఎస్పీ, రూరల్ సీఐ, ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీశైలం : ఉగాది మహోత్సవాల సందర్భంగా శ్రీశైలం వచ్చిన కన్నడిగుల్లో 8 మంది బుధవారం రాత్రి మల్లమ్మ ఆలయం వద్ద ఉన్న అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతుండగా సీఐ ప్రసాదరావు తన సిబ్బందితో కలిసి దాడి చేసి అరెస్ట్ చేశారు. సీఐ గురువారం మాట్లాడుతూ బాగల్‌కోట్ జిల్లా హిలీకల్ గ్రామానికి చెందిన మల్లేష్ (23), హనుమప్ప (24), గౌడర్ మల్లు (28), హనుగుందా వర్గజన్ గ్రామానికి చెందిన కనిగిర్ అర్జున్ (29), వలికల్ నాగరాజు (21), టి.శరణప్ప (39), గోరేబడు గ్రామానికి చెందిన హనుమంతప్ప బారేకేర్ (28), హలగమని గ్రామస్తుడు ముత్తన్న(23).. మల్లమ్మ కన్నీరు ఆలయం సమీప అటవీ పరిధిలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఏఎస్ఐ గురవయ్య, పోలీసులు రవి, రంగన్న, వెంకటనారాయణ, మహేష్, శివ, బాలకృష్ణ, శంకర్‌రెడ్డితో కలిసి దాడి చేసి అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.21,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆరేళ్లుగా అన్నం ముట్టలేదు!



ఆసనాలు వేస్తున్న శివన్న

మహానంది: ఆయన వయస్సు 65ఏళ్లు. ఆరేళ్లుగా అన్నం తీసుకోవడం లేదు. కేవలం మంచినీళ్లు, పండ్ల రసాలు మాత్రమే ఆహారం. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాడి సిదారం గ్రామానికి చెందిన శివన్న నాలుగు ఎకరాల్లో జొన్నలు, గోధుమలు సాగు చేస్తున్నాడు. మహానంది మండలం బుక్కాపురంలోని ఆయన బంధువులైన చాకలి చిన్నోడు ఇంటికి పెళ్లి కార్డులు ఇవ్వడానికి గురువారం వచ్చాడు. ఆయన యోగాసనాలు చేస్తుండటంపై ప్రశ్నించగా పలు విషయాలను వెల్లడించారు. శివన్నకు శివుడంటే ఎంతో భక్తి. తనకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు సంతానం. నిత్యం శివారాధన చేసే శివన్న 12 ఏళ్ల పాటు అన్నం, మాంసాహారం, ఘన పదార్థాలు ముట్టనని దీక్ష తీసుకున్నాడు. అందులో భాగంగానే ఇప్పటికే ఆరేళ్లు గడిచాయి. కేవలం ద్రవ పదార్థాలైన పండ్ల రసాలు, మంచినీరు మాత్రమే తీసుకుంటున్నాడు. ఇప్పటి వరకు తనకు ఎలాంటి అనారోగ్యం తలెత్తలేదని చెప్పాడు. మరో ఆరేళ్ల పాటు అన్నం ముట్టనన్నాడు. నిత్యం యోగాసనాలు చేస్తానని, పొలాల్లో పనులు సొంతంగా చేసుకుంటానని వివరించారు.

కూలీలకు నీటి వసతి కల్పించండి

నంద్యాల(సెంట్రల్): ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి కూలీలకు తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి గురువారం ఓ ప్రకటనలో సిబ్బందిని ఆదేశించారు. వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ప్రతి గంటకు ఒకసారి నీరు తాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 6 గంటలకు పనులకు హాజరై 11 గంటల లోపు ముగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. గతేడాది పంపిణీ చేసిన షెడ్లను పని ప్రదేశంలో ఉపయోగించుకోవాలని ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సూచించారు.



సున్నిపెంట ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వెలుగోడులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



పదమర ప్రాతకోట ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



నందికొట్కూరులో రంజాన్ పండుగను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముక్తి అబ్దుల్ రహిమాన్

భక్తిశ్రద్ధలతో ఈదుల్-ఫితర్

అత్మకూరు: ఈదుల్-ఫితర్ వేడుకలను పట్టణంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నెల రోజుల పాటు చేపట్టిన ఉపవాసదీక్షలను బుధవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురువారం ఉదయం మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇమాంలు ఖురాన్ సారాంశాన్ని వినిపించారు. నంద్యాల టర్నింగ్ వద్ద ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి, సోదరుడు శిల్పా భువనేశ్వరరెడ్డి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కో ఆప్షన్ సభ్యుడు రషీద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, మమీర్‌మున్నీర్‌బాషా, కనిముల్లా, బి.బాషా, నూర్‌మహ్మద్, బైరాపురం షేక్‌మహబూబ్ బాషా, షంషోర్, పైల్‌మాన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు

పాములపాడు: నెల రోజుల రంజాన్ ఉపవాస దీక్షలకు ముస్లింలు గురువారం ముగింపు పలికారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమాంలు రంజాన్ పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఖబరస్థాన్ వద్ద దువా చేశారు.

మహానంది: సాటి మనిషిని ప్రేమించడం, సేవా భావం ద్వారా అల్లాహ్ కరుణ లభిస్తుందని ముస్లిం మతపెద్దలు తెలిపారు. మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో గురువారం రంజాన్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేసి భక్తిశ్రద్ధలతో అల్లాహ్‌ను ఆరాధించడం ద్వారా ఎంతో పుణ్యఫలం దక్కుతుందన్నారు.



తిమ్మాపురంలో బోధనలు వింటున్న ముస్లింలు

నందికొట్కూరు రూరల్: మండలంలోని గ్రామాల్లో గురువారం రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బొల్లవరం, దామగట్ల, బ్రాహ్మణకొట్కూరు గ్రామాల్లోని ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



నందికొట్కూరులోని తబ్లిక్ జామద్ మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పాములపాడు ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శివపురంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఉత్సవాల విజయవంతంపై సిబ్బందికి అభినందనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలం టెంపుల్: ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు శ్రీశైల మహా క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతంగా పూర్తవడంపై గురువారం ఉదయం ఈఓ పెద్దిరాజు దేవస్థాన పరిపాలన భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైదిక కమిటీ సభ్యులు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి రవణమ్మ, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ఈఓ మాట్లాడుతూ దేవస్థానములోని అన్ని విభాగాల పనితీరును ప్రశంసిస్తూ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఉత్సవాల కంటే పది రోజుల ముందు నుంచే భక్తులు క్షేత్రాన్ని చేరుకున్నారని, భక్తులందరికీ ఎలాంటి ఇక్కట్లు కలుగకుండా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమష్టి కృషితోనే విజయవంతం చేయగలిగామన్నారు. అన్ని విభాగాల అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది సమన్వయముతో విధులు నిర్వర్తించారని కొనియాడారు.

ఉన్నతాధికారుల దిశానిర్దేశం..

జిల్లా కలెక్టర్, ఎస్పీ, అదనపు ఎస్పీ దిశానిర్దేశంతో ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టామన్నారు. వారు పరిస్థితులకనుగుణంగా తగు సూచనలు చేస్తూ ఉత్సవాలు విజయవంతమవ్వడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. పోలీస్, వైద్య, అటవీ తదితర శాఖలు తమ వంతు పాత్ర పోషించాయన్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులు ప్రసంగించారు. చివరగా దేవస్థానం సిబ్బంది ఈఓను సత్కరించారు. అలాగే అర్చకస్వాములు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి ఈఓ శ్రీస్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

వైఎస్ జగన్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యం





చింతలపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్, ఖాజీపేటలో ఓటు అభ్యర్థిస్తున్న దారా సుధీర్

మిడుతూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ఆ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని చింతలపల్లి, మజరా అయిన ఖాజీపేట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో పంటలు సమృద్ధిగా పండాయని, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేశారని, గ్రామాల్లో అభివృద్ధి పనులు ఇంతకుముందెన్నడూ చేపట్టనట్లుగా చేశారని దీంతో ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మి ఈ సంతోషాన్ని దూరం చేసుకోవద్దని కోరారు. వారు హామీలతో సరిపెడతారని, సీఎం వైఎస్ జగన్ మాత్రం ఇచ్చిన హామీలను అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవాలంటే తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి, ఎంపీటీసీ నాగేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శేషిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, తిరుమలేశ్వరరెడ్డి, లక్ష్మన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఫూలే



పాములపాడులో పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న బీసీ సంఘం నాయకులు



ఆత్మకూరులో మహాత్మా పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కొత్తపల్లిలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కస్టమ్స్ అధికారి వేల్పుల ఆనంద్



గాజులపల్లెలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన దృశ్యం

పాములపాడు: అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు గోపాల్ పేర్కొన్నారు. గురువారం పూలే జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు మురళీ, గోవిందు, శంకర్‌గౌడు, రామ్మోహన్ యాదవ్, ప్రదీప్ పాల్గొన్నారు.

కొత్తపల్లి: సామాజిక అసమానతలు లేని సమాజం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని కస్టమ్స్ అధికారి వేల్పుల ఆనంద్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా నాయకుడు ఎస్.సంపత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.స్వాములు, వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షుడు బొల్లు ప్రసాద్‌బాబు యాదవ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రం, సింగరాజుపల్లి, పెద్ద గుమ్మడాపురం గ్రామాల్లో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుమ్మడాపురం గ్రామ సర్పంచ్ నక్క విజయకుమార్, జి.మల్లయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, కె.కుక్కన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్ కుమార్, మోహన్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎలీషా, తాలూకా అధ్యక్షుడు చింతలయ్య, ఉపాధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు కృషి చేసిన పూలే సేవలు మరువలేనివన్నారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నందికొట్కూరు: భారత ప్రథమ సామాజిక తత్వవేత్త జ్యోతిరావు పూలేనని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: సామాజిక విప్లవకర్త విద్యాప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని గురువారం శ్రీశైలం ప్రాజెక్ట్‌లోని భగత్‌సింగ్ కాలనీలో జరుపుకున్నారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథ జిల్లా నాయకుడు వై.ఆశీర్వాదం ఐఎఫ్‌టీయూ, ప్రగతిశీల మహిళా సంఘం , కొమరం భీం చెంచుగిరిజన ఆదివాసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహానంది: సామాన్యుడిగా మొదలై సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన జ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్మరి ప్రసాద్, వాల్మీకి సంఘం రాష్ట్ర కార్యదర్శి గాజులపల్లె జయరాం తెలిపారు. పూలే జయంతి సందర్భంగా గాజులపల్లెలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుధాకర్, అన్సర్, రంగనాయకులు, మాబాషా, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

వెలుగోడు : బహుజనులు ఐక్యమత్యంగా ఉంటేనే రాజ్యాధికారం సాధ్యమని బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడు యాదవ్ అన్నారు. స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద పూలే జయంతి నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ ఇమ్మానియేలు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాందాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నాగేషులు, ఆర్ఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేషులు, లాయర్ రవి పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



దుద్యాలలో శ్రీలక్ష్మీ సమేత వేణుగోపాల స్వామి, శ్రీపార్వతి సమేత మల్లేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



ప్రభను అలంకరించిన దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ సమేత వేణుగోపాల స్వామి, శ్రీపార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి కమనీయంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు శ్రీధర బాలసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, భక్తుల సమక్షంలో చేపట్టిన వేడుకలో భాగంగా.. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరింపజేసి పురవీధుల్లో నంది వాహనంపై ఊరేగించారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

సంప్రదాయబద్ధంగా ప్రభోత్సవం..

శ్రీలక్ష్మీ సమేత వేణుగోపాల స్వామి, శ్రీపార్వతి సమేత మల్లేశ్వరస్వామి వార్ల ప్రభోత్సవం గురువారం రాత్రి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ముస్తాబు చేసి విశేషంగా అలంకరించిన ప్రభపై అధిష్టింపజేశారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ప్రభను ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామివార్లకు కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రభోత్సవాన్ని తిలకించేందుకు స్థానికులే గాకుండా ఇతర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

'మహో'దయం!



ప్రకృతి అందాలకు నెలవు మహానంది క్షేత్రం. నల్లమల అడవి ఒడిలో కొలువుదీరడంతో నిత్యం కొత్తందాలు భక్తులను కనువిందు చేస్తుంటాయి. పచ్చని చెట్లు, పక్షుల కిలకిలరావాలు, గంగమ్మ జల సవ్వడులు పర్యాటకులను అలరిస్తుంటాయి. ఇందులో భాగంగా.. సూర్యోదయ వేళ.. ఆదిత్యుడు నల్లమల కొండల నుంచి బయటపడే సమయంలో పసిడి కాంతులు వెదజల్లడంతో ఆలయ పరిసరాలు బంగారు వర్ణంలో మెరిసిపోయాయి. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన భక్తులు ఈ దృశ్యాలను చూసి మహదానందం చెందారు. గురువారం ఉదయం కనిపించిన ఈ దృశ్యాలను సాక్షి తన కెమెరాలో బంధించింది. – మహానంది

హెల్త్ ఫౌండేషన్‌ను రద్దు చేయాలి

బొమ్మలసత్రం: యోగా టీచర్లుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మాయ మాటలు చెప్పి పలువురి నుంచి రూ.3లక్షల నుంచి రూ.5లక్షలు వసూలు చేసి ఇప్పటివరకు వారికి జీతాలు కూడా ఇవ్వని బుద్ధ హెల్త్ ఫౌండేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏఐవైఎఫ్ నాయకుడు నాగరాముడు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్థానిక కార్యాలయంలో ఎస్పీని కలిసి మాట్లాడుతూ యోగా ఉపాధ్యాయులుగా మంచి భవిష్యత్ ఉంటుందని పలువురిని నమ్మించి 15 నెలల నుంచి వారితో పని చేయించుకుని జీతాలు ఇవ్వకపోగా, తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్న ఫౌండేషను రద్దు చేసి యోగ ఉపాధ్యాయులకు రావలసిన నగదును తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటివి జరగకుండా చూడాలని కోరారు. యోగా ఉద్యోగులు ప్రసాదు, రామకృష్ణారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.